# రంగుటద్దాలు!

మంథా వెంకట రమణరావు

ఉడిపి లంచ్ హోమ్ ముందు నిలబడి లోనికి వెళ్ళడమా మానడమా అని ఆలోచనలో పడ్డాడు సూర్యం।

సాయంత్రం అరయింది—రోజల్లా ఎండ కాయడం వల్ల కొత్త చల్లబడే సరికి ఊరి జనమంతా వీధిని పడ్డట్టు, వీధులు కిక్కిరిసిన రైల్వే ప్లాట్ ఫారమ్‌లలా ఉన్నాయి. మెయిన్‌రోడ్డు మరీనీ।

కాఫీ ఖరీదు యాభై పైసలు—"బ్రూ" ఎక్స్‌ట్రాస్ట్రాంగ్—చీనీతక్కువ—ఇద్దరు వెళ్తే వన్ బై టూ చెప్పొచ్చు కాని, ఒక్కడూ వెళ్తే ఒక కప్పు ఆర్డరివ్వక తప్పదు। పంట్లాం జేబులో ఉన్న పావలా కాసుని ఒకటికి పదిసార్లు తడిమాడు—చెల్లుతుంది ఫరవాలేదు। కాని తన బతుకే చెల్లనిది। నిట్టూర్చేడు....। అంతకన్నా చేసేదిలేక।

కృష్ణ ఎక్కడికి పోయేడు చెప్మా? ఈసరికి వచ్చేస్తానన్నాడు.

ఈ పావలా కాసుతో హోటల్లోదూరి అరకప్పు కాఫీ చెప్పడానికి నామోషీ। పూర్తి కప్పు చెప్పి పావలా అరువు పెట్టడానికి పరువు తక్కువ। ఓ దోసే తిని, పూర్తిగా కాఫీ తాగి, అంతా అరువు పెట్టడానికి దమ్ములు లేవు।

కృష్ణ వచ్చేవరకూ సిగరెట్ ముట్టిస్తే?

పది పైసలిచ్చి సిగరెట్టు, బుష్‌షర్టు జేబులో అతి జాగ్రత్తగా పదిలపరచుకున్నాడు—సిగరెట్టుని ఓ సారి బైటకుతీసి వాసన చూసి, ఆ పొగాకు వాసన నిషాని క్షణకాలం అనుభవించేడు. కృష్ణకి ఈ సిగరెట్‌లో ఫిఫ్టీఫిఫ్టీ భాగం ఉంది. కాఫీలో భాగం ఉన్నట్టే। కృష్ణ పావలా కలుపుతే ఒక కాఫీ ఔతుంది—

నవీన్ కాని కృష్ణని పికప్ చేసేడా?

సూర్యం మనసులో కోపం, జెలసీ బుస్సున పొంగేయి। నవీన్। తనకి సాయంత్రం నరకంలా ఉంటే నవీన్‌కి ప్రతి సాయంత్రమూ స్వర్గమే। అతడి చుట్టూ కీర్తిగానం చేసే బృందానికే ఆ స్వర్గంలోకి ప్రవేశార్హత ఉంటుంది।

పేవ్‌మెంట్ మీద తాను నడుస్తూ ఉంటే కాఫీకి డబ్బు లెలా అని ఆలోచిస్తూ ఉంటే, ఇవాళ వేసిన, తనకున్న ఒకేజత బట్టలు చాకలాడు రేపు తేక

పోతే ఎలాఅని ఆలోచనలు ముసురుతూ ఉంటే, ఈ ఒంటిమీది ఇవాళ వేసుకున్న బట్టలు అప్పుడే నలిగి తనకు సిగ్గు తెప్పిస్తూ ఉంటే ఈ జీవితం ఒక నరకమే ! వెరిటబుల్ హెల్ !

అప్పుడు సడన్‌గా తనపక్కని నవీన్ కారుతో వచ్చి ఆగి, "కారెక్కు సూర్యం !" అని కేకేస్తే తను కారెక్కుతాడా ?

ఎక్కను ! ఎక్కను ! ఆ కారెక్కను ! ఛీ !

ఎక్కుతాను ! ఎక్కుతాను ! ఆ కారెక్కుతాను ! హాయ్ !

ఔను ! ఆ కారు ఎక్కగానే ప్రపంచమే మరోలా అగపడుతుంది !

కఠిన నిజాలు సుందర స్వప్నాలుగా కనిపిస్తాయి ! నవీన్ మాట్లాడే అసభ్యమైన మాటలు, రోడ్డుమీద పోయే సభ్యత గల అమ్మాయిల మీది అసభ్యమైన జోకుస్, బతికున్న మనుషులని రంపంతో కోస్తున్నట్టు అనిపించవు తనకి కారెక్కిపోగానే ! ఎంతో చలాకీ మాటల్లా అనిపించి తను పకాపకా నవ్వుతాడు !

ఈ దరిద్ర దేశంలో ఏ మూలని చూసినా అగపడే మురికి, దుర్గంధం, రోగాలు, బాధలు, నిరక్షరాస్యత, ఆకలి, అమానవత్వం ఇవేవీ కారెక్కిపోగానే కనిపించవు తనకి !

కాని ఇప్పుడు కనిపిస్తున్నాయి. ఇప్పుడు తనకన్న ఆ రోడ్డుమీద నడిచే మధ్య తరగతి కుటుంబపు అమ్మాయి ఎంతో సుపీరియర్‌గా తన కనిపిస్తోంది- ఆమెతో మాట్లాడేందుకుకూడా ధమ్ములు లేవిపుడు !

ఇపుడు తనకి గొప్పగా అందని వాటిగా కనిపిస్తోన్నవి ఉడిపీ హోటల్లోని అరకప్పు కాఫీ,దోసే ! ఇంకా....

న్యూస్‌పేపర్లో వాంటెడ్ కాలమ్స్‌లో అగపడే ఉద్యోగం ! ఇంట్లో కడుపు నిండా భోజనం ! చారూ, పచ్చడి మెతుకులే అయినా అర్ధరాత్రిపూట ఆకలితో లేవకపోవడం !

తనని చూసి లోకం గౌరవించడం !

ఇవన్నీ అందనివి ఇప్పుడు-

కాని నవీన్ యొక్క కారెక్కిపోగానే ఇవేవీ దృష్టిలో పడవు !

స్టీరియో మ్యూజిక్‌ని పుట్టించే వస్తుసామాగ్రి, టేప్ రికార్డర్లు, టీ. వీ. సెట్లు ఇదివరకు గగనకుసుమాలుగా, తన లాటివారు చూసి ఆనదించే వస్తువులుగా కనిపించేవి- కారెక్కగానే తన అందుబాటులోనే ఉన్నట్టుంటాయి !

ఎందుకనగా, ఓ లక్షాధికారి యొక్క ఒకే ఒక్క కొడుకు నవీన్ వీటనన్నింటిని కొనగలడు ! అబ్బాయికి తనన్నా, కృష్ణన్నా ఇష్టం ! అతడి కారులో తాను కూర్చున్నాడు....కాబట్టి...అతడికి అందు




బాటులో ఉన్నవి తనకి అందుబాటులో ఉన్నట్టే!

"ఎదురైనచో తన మీద కరీంద్రదబు డిగ్గి, చేయూతనిచ్చి ఎక్కించుకొనియె!" కృష్ణరాయలు, పెద్దననిగౌరవించినట్టు....

తను అగపడగానే నవీన్ కారాపి, తనని కారులో ఎక్కించుకుంటాడు.

నవీన్‌కి తనూ కృష్ణా అంటే ఎందుకంత అభిమానం?

ఒకటే కారణం: తనూ, కృష్ణా

ఎం.ఏ పాసయిన, కల్చరున్న వ్యక్తులు. నవీన్ మెట్రిక్ పాసయి ఇంటర్ గట్టెక్కలేక చదువు చాలించి వ్యాపారంలో అడుగుపెట్టి తండ్రికి చేదోడు వాదోడుగా లక్షలకి మరికొన్ని లక్షలు చేరవెయ్య పూనుకున్న వ్యక్తి! అతడి చేవారుబృందం మధ్య తామిద్దరూ కల్చర్డ్‌గా అగిపించి ఉండొచ్చు!

నవీన్ కారు తలుపు తెరవగానే పెంపుడు కుక్కలా ఆ కారులో దూరే తన కల్చరేమిటి? ఎన్నోసార్లు ప్రశ్నించుకున్నాడు.

క్లాసులో మంచి మార్కులు, మంచి రేంక్ తెచ్చుకోగానే, తెలివిగా బెర్నార్డ్‌షా గురించి, ఐన్‌స్టయిన్ రిలెటివిటీ థియరీ గురించి, కాస్మోస్ గురించీ మాట్లాడగానే తను కల్చర్ అయిపోయినట్టేనా? ఈ తన కల్చర్, నవీన్ వంటి ధనవంతుడి ప్రాపు సంపాదించడానికేనా?

"నేను నాగరికుడ్నా, లేక హిపోక్రయిట్‌ని, స్నాబ్ నీనా?" అన్న ప్రశ్న ఎన్నోసార్లు తనని తాను వేసుకున్నాడు-కాని ఆ ప్రశ్నల పీకనొక్కి అణచేసేడు ఎన్నోసార్లు!

ఎన్నోసార్లనుకున్నాడు నవీన్‌కి అడుగులకి మడుగులొత్తే వాడిగా కాకుండా తన వ్యక్తిత్వం నిలుపుకోవాలని!

ఎన్నోసార్లనుకున్నాడు, నవీన్ కారాపి, 'గెటిన్! సూర్యం!' అంటే 'నో! థ్యాంక్స్! నాకు వేరే పనుంది!' అనగలగాలని!

కాని అనలేకపోయేడు!

ఇవాళే నవీన్ వస్తే ఏం చేస్తాడు? జేబులోని పావలాకాసు మనసుని పీకుతోంది. తను నవీన్‌లా ఈ జన్మలో కాలేడు!

నవీన్ పుట్టకతో రాజులా పుట్టేడు

తాను పుట్టుకతో పేదలా పుట్టేడు!

తను తెలివైన వాడే నవీన్ కన్న- కాని ఎందుకు పనికొచ్చేయవి? మంచి మార్కులు తెచ్చుకుందుకి....పనికిరావి ఎం.ఏ. డిగ్రీ తెచ్చుకుందుకి పనికొచ్చేయి! కనీసం గుమాస్తా ఉద్యోగం కోసమన్నా పనికిరావడం లేదు తన డిగ్రీ, తనూ!

కృష్ణ వస్తే బాగుణ్ణు! నవీన్ ఊళ్లో లేడు! అందువల్ల దాత లేకపోగానే యాచకులు దరిద్రుడైనట్టు తమ కాళ్ల మీద తాము నిలబడా లివాళే! ఎంత హీనస్థితి! నో! నో! తన కాళ్ల మీద తాను నిలబడగలగాలి!

ఎలా నిలబడ గలడు? ఉడిపీలో కప్పు కాఫీ అరువుపెట్టే ధైర్యం కూడా తనకు లేదే?

రోడ్డు మీద నడిచే ఆ అమ్మాయితో పరిచయం చేసుకొనే దమ్ములు తనకి లేవే, ఆమె తమ వీధిలోని అమ్మాయని తెలిసినా, ఎన్నోసార్లామెని చూడగా,




ఆమె చిరునవ్వులు అన్నిసార్లూ చిందినా !!

నవీన్‌తో కలిసి హోటళ్లలోకి దూరినప్పుడో! దోసెలు.... ఐస్‌క్రీమ్‌లు.... కూల్‌డ్రింకులు....అన్నీ అయాక పాతిక రూపాయలబిల్లు... "ఖాతాలో రాసుకో!" అంటాడు నవీన్, హోటల్‌వాడితో! బేరర్‌కి రెండు రూపాయలు పారేస్తాడు- వాడు వంగి వంగి సలాములు కొడతాడు.

తను ఒంటరిగా ఆ హోటల్లో దూరితే తననెవరూ గుర్తేపట్టరు! ఇదివరకు చిరునవ్వులు చిందిన ఆ వెయిటరే ముఖం తిప్పుకుంటాడు- యజమాని బ్లాంక్‌గా చూస్తాడు!

మగాడు పక్కని నిల్చున్నప్పుడే ఆడదానికి గౌరవం వచ్చినట్లు, ధనవంతుల కుర్రాడిపక్కన నిలబడినప్పుడే తనకీ గౌరవం! అంతే గాజులు తొడిగించున్న అమ్మాయికీ తనకి ఏముంది తేడా?

ఎదురుగా మార్కెట్ సెంటర్‌లోని నియాన్ దీపాలు జిగ్గున వెలిగేయి! ప్రకటనలు ఆహ్వానిస్తున్నాయి!

కొనండి! కొనండి! కొనండి!

ఎక్కడ చూసినా కొనండి అనడమే తప్ప, కొంటాం, కొంటాం అన్న ప్రకటనే కనిపించదు!

బట్టలుకొనండి....నగలుకొనండి.... స్టీలుసామాను కొనండి... కొనండి .... సుఖపడండి!

అంతే తప్ప ఒక్క ప్రకటనా తననీ, తనడిగ్రీని నెలకి ఇంత జీతం ఇచ్చి

కొంటాం అని కనిపించదు! కనిపించిన పేపర్లలోని వాంటెడ్ కాలమ్స్ ఏవీ తనకి పనికిరానివి. తను వాటికి పనికి రాడు. ప్రపంచంలో తను ఎందుకూ పనికిరాడా?

నవీన్‌మీదా, కృష్ణమీదా, ఈ చరాచర ప్రపంచంమీదా పట్టరాని కోపంవచ్చింది సూర్యానికి!

ఈ ధనికలోకాన్ని సమూలంగా నాశనం చెయ్యాలన్న అక్కసు పుట్టు కొచ్చింది ఈ క్షణం.

"టు హెల్ విత్ నవీన్ ఎండ్ కృష్ణా!" అనుకున్నాడు.

విసురుగా కిళ్లీ కొట్టు కేసి నడిచి అక్కడ ఆగేడు.

తన జేబులోని చవకబ్రాండ్ సిగరెట్ తీసి పెదవులమధ్య ఉంచేడు. అక్కడ వ్రేలాడుతున్న చేంతాడు నిప్పుతో సిగరెట్ ముట్టించేడు. తృప్తిగా పొగ పీల్చి, గుండెలనిండా నింపి, ముక్కులోంచి వదుల్తూ అనుకున్నాడు.... "కృష్ణా! ఈ సిగరెట్ మరి నీతో షేర్ చేసేదిలేదు! నువ్వు నవీన్‌గాడి చెమ్చావి! వాడి గులామ్‌వి! నేను కాను!" అంటూ ధీమాగా పార్కువేపు నడిచేడు.

నాలుగడుగులు అటు వేసేడో లేదో, కీచుమని బ్రేకుల చప్పుడు. కారు తన పక్కన ఆగింది. జిగాలుమని మెరిసి పోతోంది కారు కన్నెపిల్ల అందంలా!

ఉలిక్కిపడ్డాడు.

"గెటిన్ మై బోయ్! కృష్ణా కివాళ్ళ ఒంట్లో బాగోలేదు! రాలేనన్నాడు!" నవీన్‌గొంతు! ఒక చేత్తో స్టీరింగ్ పట్టుకొని, ఒకచేత్తో కారుతలుపు లోనుండి తెరిచేడు నవీన్.

సూర్యం గతుక్కుమన్నాడు!

ఇప్పుడే సమయం! "నాకు పనుంది! సారీ!" అని చెప్పేసి తెగతెంపులు చేసుకో అంటూ ఆత్మ ఘోషపెట్టింది! ఇప్పటి అనే ధైర్యం లేక పోతే మరెప్పుడూ అనలేవు!

"ఏమిటలా నిలబడ్డావ్! గెటిన్! ఉయార్ గోయింగ్ ప్లేసెస్! త్రీఏసెస్‌లో మృణాలిని కచేరీ ఉంది! నీ ఒడిలో కూచోబెడతాను దాన్ని! నాలుగేసి పెగ్గులు సిప్‌చేసి.... చికెన్ తందూరీ తిని...." ఇంకా ఏదో అంటున్నాడు నవీన్....

మరింక ఆ మాటలు తనలో కలిగించే సంచలనానికి తట్టుకోలేక, సుందరి వంపులు, పెగ్గుల నిషా, కడుపునిండా తనని ఉచ్చులతో బిగించగా, పెంపుడు కుక్కలా కారెక్కాడు సూర్యం!

కారు స్టార్టయింది....పరుగుతీసింది!

ఇప్పుడు ప్రపంచం రంగురంగుల అద్దాలలోంచి ఎంతో అందంగా అగపడు తోంది!

చేతిలోని చవక సిగరెట్ విసరేసి, నవీన్ అందించిన స్మగుల్డ్ ఫైవ్ ఫైవ్ ఫైవ్ అందుకొని, పెదవులమధ్య ఉంచి, లైటర్‌తో అంటించి పొగవదిలి ... "థాంక్స్!" అన్నాడు సూర్యం!